క్లుప్తంగా

సీసీ రోడ్డుకు వినతి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కేటీ రోడ్డు నుంచి తిమ్మభూపాలపురం గ్రామానికి సీసీ రోడ్డు వేయాలని సర్పంచ్ వరలక్ష్మి.. ఆర్ఐ నల్లయ్యకు వినతి పత్రం అందజేశారు. గురువారం తిమ్మభూపాలపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు భూసమస్యలు ఏకరువు పెట్టారు. కేటీరోడ్డు రోడ్డు నుంచి గ్రామానికి రెండు కిలోమీటర్లు మట్టి రోడ్డు గుంతలమయమై అధ్వానంగా ఉండటంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. కార్యక్రమంలో సర్వేయర్ రాజ్‌కుమార్, వీఆర్ఓ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాప్రికార్న్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సత్యవేడు : కాప్రికార్న్ ఫ్యాక్టరీ యాజమాన్యం 20 ఏళ్లకు పైగా పని చేసిన కార్మికులను అర్ధంతరంగా విధుల్లో నుంచి తొలగించడం దారుణమని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి జనార్దన్ డిమాండ్ చేశారు. గురువారం ఫ్యాక్టరీ సమీపంలో వర్షంలో గొడుగులు వేసుకొని రిలే నిరాహార దీక్షలు చేపట్టిన కార్మికులకు సంఘీభావం తెలిపారు. కాప్రికార్న్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులకు ఎలాంటి నోటీసులు లేకుండా విధుల నుంచి తొలగించడం కార్మిక చట్టాలకు విరుద్ధమన్నారు. గతంలో ఫ్యాక్టరీలో సంభవించిన ప్రమాదాల్లోనూ మరణించిన వారికి కార్మిక చట్టాల ప్రకారం పరిహారం అందజేయలేదన్నారు. మండల స్థాయిలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం సమంజసం కాదన్నారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మికులపై గన్‌మెన్‌లతో భయభ్రాంతులకు గురి చేయడం దారుణమన్నారు. కార్మిక శాఖ అధికారులు తక్షణమే స్పందించి కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేలా చూడాలని డిమాండ్ చేశారు.

పునరావాస కేంద్రానికి ముంపు బాధితులు



బాలాజీనగర్‌ను చుట్టుముట్టిన మల్రిగుంట చెరువు నీరు

రేణిగుంట : రేణిగుంట సమీపంలోని మల్రిగుంట చెరువు నిండటంతో ఎగువన ఉన్న సీబీఐడీ కాలనీ, బాలాజీ నగర్‌లో ఇళ్లను చెరువు నీరు చుట్టుముట్టింది. దీంతో స్థానికులు భయాందోళనలతో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌కు విషయం తెలియజేశారు. ఆయన అధికారులకు సమాచారం ఇవ్వటంతో ఎంపీడీఓ విష్ణు చిరంజీవి, నీటిపారుదల అధికారులు వచ్చి ముంపు ఇళ్ల నుంచి అయిదుగురిని ఎంపీడీవో కార్యాలయానికి తీసుకెళ్లారు. అయితే ఇంత జరుగుతున్నా తహసీల్దార్ రాకపోవడం విస్మయానికి గురి చేసిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

సామాన్య జనం పన్ను చెల్లించకపోతే ఏమవుతుందో ఏమోనని క్రమం తప్పకుండా కట్టేస్తుంటారు. నగదు సర్దుబాటు కాక ఆలస్యంగా చెల్లిస్తే జరిమానాతో కలిపి చెల్లిస్తున్నారు. అలాంటిది ప్రభుత్వ కార్యాలయాలు, వాటి ఆస్తులకు సంబంధించిన పన్నులు లక్షల్లో పేరుకుపోతున్నా అధికారులకు పట్టడం లేదు. మున్సిపాలిటీ పరిధిలో పదుల సంఖ్యలో ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా శాఖలకు సంబంధించిన ఆస్తులు ఉన్నాయి. వీటిలో 90 శాతానికి పైగా ప్రభుత్వ ఆస్తులకు సంబంధించి రెండు దశాబ్దాలకు పైగా పన్ను బకాయిలు పేరుకుపోయాయి. – శ్రీకాళహస్తి

పుర ప్రగతి

అధోగతి



- పేరుకుపోయిన మొండి బకాయిలు
- ప్రశ్నార్థకంగా పట్టణ అభివృద్ధి
- పన్ను చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలు
- ఇప్పటికీ 50 శాతమే పన్ను వసూళ్లు

మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాం.. సౌకర్యాలు పొందుతున్నాం.. పన్నులు చెల్లించాలనే విషయమే ఆయా శాఖలు మరిచిపోయాయి. బకాయిలు చెల్లించాలన్న స్పృహ ఆయా శాఖల అధికారుల్లో కానరావడం లేదు. పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు పన్నులు. అలాంటి పన్నులు పేరుకుపోతున్నా వసూళ్లపై అధికారులు వారి వద్ద నుంచి రాబట్ట లేకపోతున్నారు. అందుకే ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిలు రూ. 2.26 కోట్లకు చేరింది. ఈ ప్రభావం నేరుగా పట్టణ అభివృద్ధిపై పడుతోంది. నియోజకవర్గ కేంద్ర శ్రీకాళహస్తి పట్టణంలో ఆస్తి పన్నుల ద్వారా రూ. 7.50 కోట్లు వసూలు కావాల్సింది. పాత బకాయిలు రూ.2.26 కోట్లు రూ 9.76 కోట్లు పన్ను రూపంలో వసూలు కావాల్సి ఉంది.

సగమే పన్ను వసూళ్లు

శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఇప్పటి వరకు సుమారు రూ.4.30 కోట్ల పాత, కొత్త పన్నులు వసూలయ్యాయి. ఈ లెక్కన 50 శాతం మాత్రమే పన్ను వసూలు జరిగింది. మొండి బకాయిలుగా రూ.1.23 కోట్లు ఉండగా దానిలో దేవాదాయశాఖకు సంబంధించిన స్కిట్ కళాశాలకు సంబంధించిందే రూ.73 లక్షల వరకు బకాయి ఉంది. అలాగే శ్రీకాళహస్తి ఆలయం పార్కింగ్ వసూలుకు సంబంధించి పురపాలక సంఘం వాటా వివాదంతో రూ. 2 కోట్లకు పైగా బకాయిలు రావాల్సి ఉంది. దానిపై అధికారులు పలు దఫాలుగా ఆలయ ఈఓల దృష్టికి తీసుకెళుతున్నారు. ఇవన్నీ వెరసి కొండలా పేరుకుపోయిన మొండి బకాయిల్లో ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిందే ఎక్కువగా ఉంది. ఈ బకాయిలతోనే ఏటా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉండగా పన్ను వసూలు కాకపోవడంతో అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారింది.

సౌకర్యాల కల్పనకు పన్నులే కీలకం

సుమారు లక్ష జనాభా నివసిస్తున్న శ్రీకాళహస్తి పట్టణంలో తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్ దీపాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన ఇతర అత్యవసర సమస్యలు పరిష్కరించేందుకు పురపాలక సంఘానికి ఆర్థిక పరిపుష్టి అవసరం. ఇందుకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కీలకంగా మారింది. ప్రభుత్వం నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరైనా అన్ని అవసరాలు తీరాలంటే పురపాలక సంఘం సొంత ఆదాయంపై ఆధార పడాల్సి ఉంటుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 8 నెలలు గడిచినా నిర్దేశిత లక్ష్యాల్లో 50 శాతమే పూర్తి చేయగలిగారు.

ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం

“ పన్నుల వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయడానికి రెవెన్యూ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించాం. ప్రభుత్వ కార్యాలయాల పన్ను బకాయిల వసూలుకు సంబంధించి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. సిబ్బంది క్షేత్రస్థాయికి వెళ్లి నోటీసులు అందజేస్తున్నారు. పన్ను వసూలు కోసం ఆయా శాఖలు ప్రభుత్వం నుంచి బడ్జెట్‌కు ఆమోదం పొందాలని చెబుతున్నాం.

– గిరి, మున్సిపల్ కమిషనర్, శ్రీకాళహస్తి

నోటీసులు జారీ చేస్తూ..

ఆర్థిక సంవత్సరం సుమారు వంద రోజుల్లో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో భారీగా పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయిలు అధికారులను ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో బకాయిల వసూళ్లకు పురపాలక రెవెన్యూ విభాగం అధికారులు సమాయత్తం చేస్తున్నారు. ఆస్తి పన్ను చెల్లించని ప్రభుత్వ కార్యాలయాలకు నోటీసులు జారీ చేసే ప్రక్రియ వేగవంతం చేశారు. నిర్ణీత గడువు లోగా ఆస్తిపన్ను చెల్లించకపోతే ఏపీ మున్సిపల్ చట్టం 1965లోని రెవెన్యూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో పేర్కొంటున్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కల్వర్టు పరిశీలన



మూడు గండ్లు వారధి కల్వర్టును పరిశీలిస్తున్న సీఐ,ఎస్ఐ

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని తలారివెట్టు పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ వద్ద కేటీరోడ్డుకు ప్రమాదం అంచున ఉన్న మూడు గండ్లు వారధి కల్వర్టును గురువారం బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు పరిశీలించారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు మూడు గండ్లు వారధి కల్వర్టు కొట్టుకుపోవడంతో వాహనదారులకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. దీనిని పరిశీలించి మాట్లాడుతూ.. ప్రస్తుతానికి కల్వర్టుకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. కల్వర్టు వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తామన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



శ్రీనివాస్‌నాయక్, న్యాయమూర్తి

శ్రీకాళహస్తి : రాష్ట్ర అత్యున్నత న్యాయస్థాన ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని న్యాయస్థాన భవనంలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటలకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో కోర్టులో పెండింగ్‌లో ఉన్న సీవీ, వివాహ, మోటారు వాహన సంబంధ కేసులతో పాటు రాజీ కాదగిన క్రిమినల్ కేసులు, వాజ్యం వేయని కేసులను పరిష్కరిస్తారన్నారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు, వివిధ సంస్థల అధికారులు లోక్‌అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారం కావడానికి సహకరించాలని కోరారు.

ఆగమోక్తంగా బాలదీపాలు



బాలదీపాల ఊరేగింపులో అర్చకులు, ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం బాలదీపాలను ఆగమోక్తంగా వెలిగించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా ఆలయంలోని మహానంది వద్ద చుక్కాని నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఒకరోజు ముందు ఆలయంలో బాలదీపాలను వెలిగిస్తారు. గురువారం ఆలయంలోని అమ్మవారి సన్నిధిలో వేదపండితులు ప్రత్యేక హోమపూజలు చేసి, ఆ జ్వాలతో బాలదీపాలను వెలిగించారు. శుక్రవారం సాయంత్రం ఆ బాలదీపాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పూజలు చేస్తారు. అనంతరం ఆ దీపాలను అక్కడ ఉంచి చుక్కానిని ప్రజ్వలింపజేస్తారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం భరణి దీపం వరకు బాలదీపాలు నిరంతరం వెలిగేలా స్వామివారి సన్నిధిలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంత ప్రజలను ఆదుకోండి

శ్రీకాళహస్తి : లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అంగేరి పుల్లయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని వాపోయారు. నియోజకవర్గ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపునీరు చేరి ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వ్యవసాయ, భవన నిర్మాణ రంగ కూలీలకు పని కరువైందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమై లోతట్టు ప్రాంత ప్రజలకు అండగా నిలబడాలని సూచించారు. నిత్యావసర సరుకులు అందజేసి రెండు రోజులుగా ఉపాధి కోల్పోయిన కూలీలకు భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు.

హామీలు అబద్ధాలేనా బాబు !

- సత్యవేడు సాక్షిగా ఎన్నికల వాగ్దానాలు మరిచిన ముఖ్యమంత్రి
- నియోజకవర్గంలో పేరుకుపోయిన సమస్యలు
- ఆరునెలలు గడిచినా కార్యాచరణకు నోచుకోని సీఎం హామీలు



సత్యవేడులోని బ్రిటీష్ కాలం నాటి తహసీల్దార్ కార్యాలయం

వరదయ్యపాళెం : కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరునెలలు పూర్తయింది. అభివృద్ధి పరంగా ఎంతో వెనుకబడిన సత్యవేడును అభివృద్ధి చేసే బాధ్యత నాది అంటూ స్వయంగా ఈ ఏడాది ఏప్రిల్ 20న ఎన్నికల సమయంలో సత్యవేడుకు వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఊకదంపుడు హామీలతో నియోజకవర్గ ప్రజలను ఊరడించారు. కానీ ఎన్నికల ప్రచారంలో పలు హామీలు గుప్పించినా ఒకటీ ఆచరణకు నోచుకోకపోవడంపై బాబు అబద్ధపు హామీలపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు హామీలు..
అమలు కాని సమస్యలు ఇవే :

- సత్యవేడులో ఆర్డీఓ , డీఎస్పీ కార్యాలయాల ఏర్పాటు
- సత్యవేడు సీహెచ్‌సీ 100 పడకల ఆస్పత్రిగా మార్పు
- సత్యవేడు ఇరుకురోడ్ల నుంచి మినహాయింపుగా బైపాస్ రోడ్డు
- సత్యవేడు, వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా అభివృద్ధి చేయడం
- సత్యవేడు, దాసుకుప్పం ప్రాంతాల్లో బైపాస్ రోడ్డు నిర్మాణం
- డిగ్రీ కళాశాలకు పక్కా భవనాలు
- తహసీల్దార్ , కోర్టు భవనం, సబ్ జైలు కార్యాలయాలకు నూతన భవనాలు
- ప్రజల తాగునీటి అవసరాలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం.





వంద పడకల స్థాయికి అభివృద్ధి చెందాల్సిన సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఛిద్రమైన కదూరు కూడలి-సత్యవేడు ప్రధాన రోడ్డు మార్గం

బుచ్చినాయుడుకండ్రిగ : కేటీరోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు



రేణిగుంట : పోస్టాఫీస్ వీధి జలమయంతో చిరువ్యాపారుల అవస్థ



నెల్లటూరులో కాలువ తెగడంతో ఇళ్ల మధ్యలోకి చేరిన వర్షపు నీరు



జడివాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- స్తంభించిన జనజీవనం
- నీట మునిగిన పంటలు

రేణిగుంట : తుపాను ప్రభావంతో రేణిగుంటలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని బిస్మిల్లా నగర్, భగత్‌సింగ్ కాలనీ, రజక కాలనీ, వివేకానంద కాలనీల చుట్టూ వర్షపు నీరు చేరింది. ఇళ్లలోకి నీరు రావడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. మండలంలోని దొడ్లమిట్టలో వాగు ఇళ్ల మధ్యన ప్రవహించటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

రాకపోకలు బంద్

మండలంలో కల్లూరు వంక ఉధృతంగా ప్రవహించడంతో అత్తూరు, అమ్మవారిపట్టెడ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని జీపాళెం, నల్లపాళెం మార్గంలో స్వర్ణముఖి నదిలో నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీని రాళ్లకాల్వ వాగు చుట్టు ముట్టింది. అలాగే ఏర్పేడు మండలం చెన్నంపల్లి, పెన్నగడం గ్రామాలకు స్వర్ణముఖీ నది నక్కలవాగు దాటనివ్వకపోవటంతో రాకపోకలు నిలిచిపోయాయి. గోవిందవరం, కొత్తవీరాపురం లోలెవల్ కాజ్‌వేలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

నీట మునిగిన వరినార్లు

మండలంలోని ఎల్ ఎన్ కండ్రిగ, ఆర్.మల్లవరం, కుమ్మరపల్లి, కృష్ణాపురంలలో వరినాట్లు నీట మునిగాయి. మండలంలోని గుత్తివారిపల్లి, ఎస్‌యూపురం గ్రామాల్లో అరటి తోటలు నేలకొరిగాయి. ఏర్పేడు మండలం పాతవీరాపురం గ్రామాన్ని వర్షపు నీరు చుట్టేసింది. గ్రామం చుట్టూ వర్షపు నీరు చేరడంతో రాకపోకలు స్తంభించాయి. పాతవీరాపురం ఎస్టీ కాలనీ చుట్టూ వర్షపు నీరు చేరింది. చెరువు నిండి కలుజు ప్రవహిస్తోంది. ముసలిపేడు, పాతవీరాపురం గ్రామాల్లో వరిపైరు నీట మునిగింది. ఏర్పేడు చెరువు కలుజు పారటంతో ఆ నీళ్లు యాదవ వీధి మీదకు రావటంతో సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ లక్ష్మయ్య నీటిని దారి మళ్లించారు.

బుచ్చినాయుడుకండ్రిగ : బుచ్చినాయుడుకండ్రిగలోని ఆరుంధతివాడ వద్ద కనమనంబేడు రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం కూలీల సహాయంతో తొలగించారు. మండలంలోని కాళంగినది లోకి వర్షపు నీరు భారీగా చేరటంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నది పక్కనే ఉన్న కాటూరు, పల్లమాల, తహనగర్, ఆలత్తూరు గ్రామాల పొలాల్లోని విద్యుత్ మోటార్లు, పంటలు దెబ్బతిన్నాయి. అదే విధంగా చీటికాలువ, పందికాలువ, కారణివేరు, ఏడు, రెండు, మూడు, గండ్లు వారధి కాలువలు జోరుగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని పల్లమాల, జంబుగోళం, జీఎన్‌కండ్రిగ, నెరిణికండ్రిగ, కారణి, కాంపాళెం, వెస్టువరత్తూరు, కుక్కంబాకం, నెలవాయి, కనమనంబేడు, కల్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం, కమ్మవారికండ్రిగ గ్రామాల్లోని సుమారు 3,500 ఎకరాల్లోని వరిపంట నీట మునిగి దెబ్బతింది. జంబుగోళం, నెరిణికండ్రిగ గ్రామాల్లోని 150 ఎకరాలలో వేసిన వరిపంట పూర్తిగా దెబ్బతినటంతో రూ. 15 లక్షలకు పైగా నష్టం వాటిల్లింది. మండలంలోని కాళహస్తి-తడ రోడ్డు భారీ వర్షంతో జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల వద్ద కేటీ రోడ్డుపై వర్షపు నీరు భారీగా చేరింది.





రేణిగుంట : దొడ్లమిట్టలో వాగును తలపిస్తున్న వీధులు, ఏర్పేడులో జలదిగ్బంధంలో ఇళ్లు

వరదయ్యపాళెం : మండలంలోని సంతవేలూరు మార్గంలో పెద్ద పాండూరు నుంచి తొండంబట్టు మార్గం, శ్రీకాళహస్తి-తడ మార్గంలో రాకపోకలు స్తంభించాయి. గోవర్ధనపురం వద్ద మారేడు కాలువ వద్ద నీటి ఉధృతి పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గోవర్ధనపురం లోలెవల్ కాజ్‌వే వద్ద అపాచీ బస్సు ఇరుక్కుపోయింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలను పోలీసులు ఆపివేశారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

చిన్న పాండూరు సమీపంలోని నక్కలమిట్ట వద్ద ఉన్న షికారీలు గురువారం ఆందోళన చేపట్టి నిరసన తెలిపారు. షికారీల యూనియన్ నాయకురాలు పూలరాణి ఏకంగా రోడ్డుపై బైఠాయించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న శ్రీసిటీ డీఎస్పీ పైడేశ్వరరావు ఆందోళనకారుల వద్దకు చేరుకుని చర్చలు జరిపి నిరసనను విరమింపజేశారు.







ఏర్పేడు : పాతవీరాపురం పొలాల్లో నీటమునిగిన వరితో దిగాలులో రైతు చెంగారెడ్డి, వరదయ్యపాళెం : గోవర్ధనపురం వద్ద జేసీబీతో అవతలివైపునకు తరలిస్తున్న పోలీసులు, కదూరు హరిజనవాడలో ఇళ్ల మధ్యలోకి చేరిన వర్షపు నీరు